## క్లుప్తంగా

### ఆలయాలు శుద్ధి



నర్సాపూర్ ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న నాయకులు

దండేపల్లి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో దండేపల్లి మండలం నర్సాపూర్ శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి, షిర్డీ సాయి బాబా, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాల పరిసరాలను బీజేపీ నాయకులు శనివారం శుభ్రం చేశారు. అనంతరం ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, నాయకులు గుండ ప్రభాకర్, ఎంబడి సురేందర్, ముత్తినేని మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: స్వచ్ఛతీర్థ అభియాన్‌లో భాగంగా శ్రీరాంపూర్‌లో బీజేపీ నాయకులు ఆలయాన్ని శుద్ధి చేశారు. శనివారం ఆర్కే 6 కొత్త రోడ్ లోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయాన్ని నీటితో శుద్ధి చేశారు. పార్టీ పట్టణ నాయకుడు సత్రం రమేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు భీమ్ నాయక్, పూజారి హరిప్రసాద్, బీజేపీ నాయకులు మొగిలి, చక్రవర్తి, రమేశ్, భీమయ్య, శ్రీకాంత్, కనకయ్య, నరేందర్, రణదీప్ పాల్గొన్నారు.

### ఘనంగా సుందరకాండ పారాయణ మహాయాగం



పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలోని హైలైఫ్ హోటల్‌లో ఆవోపా ఆధ్వర్యంలో డాక్టర్ బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి అధ్యక్షతన అష్టోత్తర శత సుందరకాండ పారాయణ సహిత శ్రీ రుద్ర మహాయాగాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు దంపతులు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, ఉదయశ్రీ దంపతులు పాల్గొని పూజలు చేశారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ రాహుల్ పరిశీలించారు. నూతన ఓటరు నమోదు, మార్పులు, చేర్పులపై బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. ఎంపీడీవో లక్ష్మయ్య, తహసీల్దార్ సదానందం, ఎంపీవో బాపురావు ఉన్నారు.

### పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

కాసిపేట: మండల కేంద్రంలోని కాసిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో యాదయ్య శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వారితో లెక్కలు బోర్డుపై చేయించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం సాంబమూర్తి, ఉపాధ్యాయులు రమణారెడ్డి ఉన్నారు.

### అభివృద్ధి పనులు చేపడుతాం

భీమారం: మండలంలో 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.10 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ చెర్కు దీపికారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ప్రణాళిక నిధుల ద్వారా చేపట్టనున్న పనుల ఎంపిక తీర్మానం చేయనున్నామని తెలిపారు. తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ పెద్దల రూప, అధికారులు పాల్గొన్నారు.

### గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

దండేపల్లి: క్రీడాకారులు గెలుపు లక్ష్యంతో ముందుకు సాగాలని లక్సెట్టిపేట సీఐ కృష్ణ అన్నారు. దండేపల్లి మండలం కన్నెపల్లిలో ముత్తె స్వామి స్మారకార్థం నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను శనివారం సీఐ ప్రారంభించారు. దండేపల్లి, లక్సెట్టిపేట ఎస్సైలు ప్రసాద్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఆపద్బాంధవులు

- ఆపదలో అండగా యువకులు
- రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తూ..
- సామాజిక సేవలో యూత్ సభ్యులు



అశోక్ ను సన్మానిస్తున్న అధికారులు

జన్నారం: అన్నిదానాల్లో కెల్లా రక్తదానం మిన్న. ఎవరైన ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలపాలైన క్రమంలో రక్తం అవసరం ఉంటుంది. ఆపత్కాలంలో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలుస్తున్నారు పలువురు యువకులు. సామాజిక సేవలో భాగస్వాములై వివిధ కార్యక్రమాలు చేపట్టి మన్ననలు పొందుతున్న వారిపై ప్రత్యేక కథనం.

**సేవ కార్యక్రమాల్లో ముందంజ..**

జన్నారం మండలంలోని పలు గ్రామాల్లో యువకులు కలిసి యూత్ అసోసియేషన్‌గా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వివిధ సందర్భాల్లో రక్తదానం చేస్తూ పలువురికి ప్రాణదానం చేస్తున్నారు. పొనకల్‌కు చెందిన పలువురు యువకులు స్నేహ యూత్ పేరుతో 2003లో యువజన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రక్తదానంలో పేరు తెచ్చుకున్నారు. సమాజసేవలో ముందుంటూ యువజనోత్సవం సందర్భంగా ఉత్తమ యూత్ అవార్డులు అందుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం, విద్యార్థులకు పోటీపరీక్షలు పెట్టి ప్రోత్సహించేవారు. మేధ ట్రస్టు సహకారంతో ఉచిత బ్యాగులు, నోటు పుస్తకాలు అందజేశారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహం తీర్చారు.

- కిష్టాపూర్ గ్రామానికి చెందిన యంగ్‌స్టార్ యూత్ పలు సేవ కార్యక్రమాల్లో పేరు తెచ్చుకుంది. గ్రామంలో ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, అన్నదానం, శ్రమదానం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ, అవసరం ఉన్నవద్ద వారికి రక్తదానం చేశారు.
- తిమ్మాపూర్ గ్రామ క్రేజీ యూత్ సభ్యులు రక్తదానం చేశారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పుట్టినరోజున ఆరుగురు సభ్యులు రక్తదానం చేసినట్లు చెబుతున్నారు. రామగుండం సీపీతోపాటు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరాల్లో రక్తదానం చేశారు. సేవలో ముందుండి, పలుమార్లు రక్తదానం చేయడంతో జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారులతో సన్మానం పొందారు.

**రక్తదాతలు..**

స్నేహయూత్‌లో 8 మంది సభ్యులు పలుమార్లు రక్తదానం చేశారు. అధ్యక్షుడు దుమల్ల అశోక్ 18 సార్లు, ఒక్కొక్కరు పది సార్లకు పైగా రక్తదానం చేశారు. కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల ఆసుపత్రులకు వెళ్లి రక్తదానం చేస్తారు. వారివద్ద సరిపడా గ్రూపు రక్తం లేకపోతే బదిలీగా బ్లడ్‌బ్యాంక్‌కు వారి రక్తం ఇచ్చి రోగికి సరిపడా గ్రూపు రక్తం అందేలా చూస్తారు. ఇలా స్నేహయూత్ పలువురు అభినందనలు, సన్మానాలు, సత్కారాలు పొందుతోంది. పోలీసుల అధ్వర్యంలో యంగ్‌స్టార్ యూత్ సభ్యులు 8 మంది రక్తదానం, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు.

**సభ్యుల సహకారంతో..**



2003లో 15 మందితో స్నేహ యూత్ ఏర్పాటు చేసుకున్నాం. శ్రమదానం, హరితహారం, పోలియో చుక్కలు తదితర ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొన్నాం. రక్తదానం చేస్తూ పలువురిని ఆదుకున్నాం. సభ్యుల సహకారం, ప్రోత్సాహంతో యూత్ సేవలను విస్తరిస్తాం.

– దుమల్ల రమేశ్, అధ్యక్షుడు స్నేహయూత్

**పలుమార్లు రక్తదానం చేశాం**



గత పదేళ్ల క్రితం యంగ్‌స్టార్ యూత్ ఏర్పాటు చేసి యువకులం సేవా కార్యక్రమాలు చేసేవాళ్లం. పలువురు సభ్యులు వివిధ సందర్భాల్లో రక్తదానం చేశారు. సేవా కార్యక్రమాల్లో యూత్ ముందుంటుంది.

– వాసాల నరేశ్, కిష్టాపూర్ యంగ్‌స్టార్ యూత్ అధ్యక్షుడు

**సేవలో ముందుంటాం**



గత ఆరేళ్ల క్రితం తిమ్మాపూర్‌లో యువకులందరం కలిసి క్రేజీ యూత్ ఏర్పాటు చేసుకున్నాం. రెడ్‌క్రాస్ సొసైటీ, రామగుండం కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో సభ్యులు రక్తదానం చేశారు. సేవలో ముందుండి కార్యక్రమాలు చేపడుతాం.

– ప్రదీప్, క్రేజీ యూత్ అధ్యక్షుడు

## ఎస్‌ఎంసీ ఎన్నికకు నోటీసు విడుదల

నెన్నెల: మండలంలోని నార్వాయిపేట ప్రాథమిక పాఠశాలలో ఎస్‌ఎంసీ ఎన్నికకు ఇన్‌చార్జి హెచ్‌ఎం జలంపల్లి శ్రీనివాస్ శనివారం నోటీసు విడుదల చేశారు. ఈనెల 29న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అర్హులైన తల్లిదండ్రుల జాబితా గ్రామపంచాయతీ కార్యాలయం, పాఠశాల నోటీసు బోర్డులపై అంటించారు. అభ్యంతరాలపై తమ పాఠశాలల్లో ఈనెల 22 వరకు నివేదించాల్సిందిగా కోరారు. పేరేంట్స్ మీటింగ్ హాజరైన తల్లిదండ్రులకు ఎస్‌ఎంసీ ఎన్నికల హాజరు ఆహ్వానపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదయ్య, స్నేహలత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**ఎస్‌ఎంసీ ఎన్నికలపై చర్చ**

మంచిర్యాలఅర్బన్: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈనెల 29న జరిగే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) ఎన్నికలపై చర్చించారు. తల్లిదండ్రులు హాజరై కమిటీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షులు, సభ్యులను ఎన్నుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఉపాధ్యాయులు, పేరేంట్స్ పాల్గొన్నారు.

## సారూ...బడికి రారు!

- విధులకు డుమ్మా కొట్టిన నందరాంపల్లి హెచ్‌ఎం

కోటపల్లి: మండలంలోని నందరాంపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులు విధులు డుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, గ్రామస్తులు శనివారం పాఠశాలను సందర్శించగా హెచ్‌ఎం వేణుమాధవ్ హాజరుకాలేదు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాల్సి ఉండగా సదరు హెచ్‌ఎం గైర్హాజరయ్యారు. అయితే హెచ్‌ఎం సెలవులో ఉన్నట్లు తనకు సమాచారం లేదని సిర్సా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మొగిలి తెలిపారు.

## 22న మాంసం క్రయవిక్రయాలు నిలిపివేయాలి

బెల్లంపల్లి(తాండూర్): ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా తాండూర్ మండలంలో మాంసం క్రయ విక్రయాలను నిలిపివేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీ కృష్ణ దేవ రాయలు కోరారు. శనివారం తహసీల్దార్ రోహిత్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు విజయ్‌కుమార్, శేషగిరి, మహీధర్‌గౌడ్, భరత్, శ్రీనివాస్, కుమార్, మల్లేశ్, ప్రదీప్, ప్రవీణ్, బుచ్చయ్య ఉన్నారు.

మంచిర్యాలటౌన్: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన నేపథ్యంలో మంచిర్యాలలో ఆది, సోమవారాల్లో మేక, గొర్రె, కోడి, చేపల విక్రయ దుకాణాలు మూసివేయాలని హిందూ ఉత్సవ సమితి సభ్యులు కోరారు. శనివారం మున్సిపల్ మేనేజర్ కె.విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కర్ణకంటి రవీందర్, తుల మధుసూదన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్న మల్లయ్య, ప్రధాన కార్యదర్శి బోగు సురేందర్, అసోసియట్ అధ్యక్షుడు సబ్బని లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు సీహెచ్.వాసుదేవమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దూరి భాస్కర్ పాల్గొన్నారు.

### గిరిజన ఉపాధ్యాయ సంఘం.,

మంచిర్యాలటౌన్: తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం(టీజీయూఎస్) 2024 డైరీ, క్యాలెండర్‌ను జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి మడావి గంగారాం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకాడమీ ఏసీఎంవో ఎం.రాజమౌళి, ఏటీడబ్ల్యూవో చిరంజీవి, స్పెషల్ ఆఫీసర్ ఎం.శంకర్, రఘునాథ్, టీజీయూఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భూక్య రూప్లానాయక్, బానావత్ ప్రకాశ్ పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ఆటోకు స్టిక్కర్ అంటిస్తున్న ఎంవీఐ, సిబ్బంది

బెల్లంపల్లి: వాహనదారులు, డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని మంచిర్యాల ఎంవీఐ యోగేశ్వర్ జాదవ్ తెలిపారు. బెల్లంపల్లిలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం వారికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతోపాటు ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. మత్తు పదార్థాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. వాహనాలను ఏటా ఫిట్‌నెస్ చేయించుకుని రోడ్డుప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. అనంతరం వాహనాలకు రోడ్డు భద్రత వారోత్సవాల స్టిక్కర్లను అంటించారు.

## ప్రత్యేక ఓటరు శిబిరాల సందర్శన



ముల్కల్లలోని దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆర్డీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఫొటో ఓటరు జాబితా సవరణలో భాగంగా హాజీపూర్ మండలంలోని నంనూర్-గుడిపేట గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు శిబిరాలను ఆర్డీవో రాములు శనివారం సందర్శించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో బీఎల్వోలు అందుబాటులో ఉంటారన్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికల అధికారి గడియాం శ్రీహరి, నాయబ్ తహశీల్దార్ హరిత, గిర్దావర్‌లు ప్రభు, మంగ ఉన్నారు.

దండేపల్లి: అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని మంచిర్యాల ఆర్డీవో రాములు అన్నారు. దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్‌ఐ భూమన్న పాల్గొన్నారు.

**ఓటరుగా నమోదు చేసుకోవాలి**

నెన్నెల: మండలంలో 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ అన్నారు. మండలంలో శనివారం ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొత్తగా నమోదు, మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. ప్రత్యేక నమోదులో భాగంగా అన్ని పోలింగ్‌లో సవరణలు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉందని వివరించారు. ఓటరు జాబితాలను పరిశీలించి బీఎల్వోలకు పలు సూచనలు చేశారు. మండలంలోని 23 పోలింగ్ బూత్‌లలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ గణేశ్ ఉన్నారు.

## ఘనంగా శ్రీరామాయణ మహాయాగం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

మంచిర్యాలటౌన్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ దంపతుల ఆధ్వర్యంలో శనివారం శ్రీసుదర్శన నారసింహ సహిత విశ్వశాంతి శ్రీరామాయణ మహాయాగాన్ని ఘనంగా ప్రారంభించారు. ముందుగా శ్రీవిశ్వనాథ ఆలయంలో పూజల అనంతరం కలశాన్ని తీసుకుని శోభాయాత్రగా జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు సాగింది. వేదపండితుడు నరసింహ శాస్త్రి నేతృత్వంలో యాగాన్ని ఎమ్మెల్యే దంపతులతో చేయించారు. భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో రామరాజ్య పాలన జరగాలనే సంకల్పం, అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఈ యాగం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

## లక్ష్య సాధనకు కష్టపడాలి

- అదనపు కలెక్టర్ రాహుల్
- కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



వేమనపల్లి: మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్



బెల్లంపల్లి: మాట్లాడుతున్న బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్

వేమనపల్లి: విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడాలని అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని నీల్వాయిలోని కస్తూరిబా గాంధీ, ఆశ్రమ పాఠశాలల్లో 9, 10 తరగతి విద్యార్థినులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. లక్ష్యంతో ఎలా ముందుకెళ్లాలి, ఎలా సాధన చేయాలో వివరించారు. ఎంపీడీవో లక్ష్మయ్య, సర్పంచ్ గాలి మధు, తహసీల్దార్ సదానందం, ఎంపీవో బాపురావు, ఎంఈవో తిరుపతిరెడ్డి, వైద్యాధికారి రాజేష్, పశువైద్యాధికారి అరుణ, ఏపీఎం ఉమారాణి, ఏపీవో సత్యప్రసాద్ హెచ్‌ఎం గిరిధర్‌రెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ మయూరి పాల్గొన్నారు.

నెన్నెల: విద్యార్థినులు బాగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కీర్తిప్రతిష్టలను తేవాలని నెన్నెల, భీమిని ఎంపీడీఓలు వరలక్ష్మి, జవహర్ అన్నారు. నెన్నెల, భీమిని కస్తూరిబా పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్, ఎంపీఓ శ్రీనివాస్, ఎస్ఓ కవిత, కార్యదర్శులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కేజీబీవీ విద్యార్థినులకు విద్యార్థులకు 'జీవన ప్రగతి మార్గదర్శక' సమావేశాన్ని శనివారం నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, మున్సిపల్ డీఈఈ మధుకర్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, మున్సిపల్ టీపీఎస్ శ్యాంసుందర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ నాగరాజు, ప్రిన్సిపాల్ స్వప్న కెరీర్ గైడెన్స్ మోటివేటర్లుగా వ్యవహరించారు.

చెన్నూర్: అదనపు కలెక్టర్ ఆదేశాలతో స్థానిక కేజీబీవీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎంఈవో రాధాకృష్ణమూర్తి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రత్యేకాధికారి సుమలత, తహసీల్దార్ మల్లికార్జున్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ఏపీవో గంగాభవాని, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

జైపూర్: విద్యార్థులు పదో తరగతి తర్వాత సరైన మార్గాన్ని ఎంచుకోవాలని ఎస్సై ఉపేందర్‌రావు, ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. బాలసభ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో కేజీబీవీ విద్యార్థినులకు కెరీయర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఏవో మార్క్‌గ్లాస్టన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్‌రావు, వైద్యాధికారి సింధురా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిబాల పాల్గొన్నారు.

బెల్లంపల్లి: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని చదువుకోవాలని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. బెల్లంపల్లి కేజీబీవీ విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఎంఈవో మహేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో రాజేందర్, పీహెచ్‌సీ వైద్యురాలు ఆంజెలినా పాల్గొన్నారు. తాండూర్ మండల కేజీబీవీలో 9,10 తరగతులు, ఇంటర్ విద్యార్థులకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, మెడికల్ అధికారి కుమారస్వామి, ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి పాల్గొన్నారు.

కోటపల్లి: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని ఎంపీడీవో భాస్కర్ విద్యార్థులకు సూచించారు. కోటపల్లి కేజీబీవీలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఏవో మహేందర్, ఎస్‌వో హరిత, డాక్టర్ సత్యనారాయణ, పశువైద్యాధికారి పవన్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం: విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే శ్రమించాలని ఎంపీడీవో అరుణరాణి, ఎంఈవో విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ ఆదేశాలతో జన్నారంలోని కేజీబీవీలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండవ ఎస్సై మృత్యుంజయ సర్కార్, వైద్యాధికారి ఉమశ్రీ, ఎంపీవో రమేశ్, ఎఫ్‌ఎస్‌వో కిరణ్మయి, పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీవాణి పాల్గొన్నారు.

దండేపల్లి: అదనపు కలెక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు దండేపల్లి కేజీబీవీలో శనివారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 9,10 తరగతులు చదివే విద్యార్థులకు కెరీర్‌కు సంబంధించిన పలు విషయాలను ఎంపీడీవో మల్లేశంతోపాటు, శాఖల అధికారులు తెలియజేశారు. ఏవో అంజిత్‌కుమార్, మండల వైద్యాధికారి సతీష్, పశువైద్యాధికారి ధన్‌రాజ్, పీఆర్ ఏఈఈ విక్రమ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, పంచాయతీ కార్యదర్శి పృథ్వి, కానిస్టేబుల్స్ సునీల్, దివ్య, ఎస్వో మంజుల పాల్గొన్నారు.

భీమారం: విద్యార్థినులు బాగా చదవాలని తహసీల్దార్ విశ్వంబర్ అన్నారు. భీమారంలోని కేజీబీవీలో కెరీర్‌గైడెన్స్ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పాఠశాల ప్రత్యేక అధికారి కనకలక్ష్మి, పశువైద్యాధికారి రాకేశ్‌శర్మ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విక్రమ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

## బాలికా సాధికారతకు బాటలు వేయాలి



సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కోటపల్లి: బాలికా సాధికారతకు బాటలు వేయాలని హెచ్‌ఎం గుండేటి యేగేశ్వర్ అన్నారు. మండలంలోని పారుపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో తల్లిదండ్రులకు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ బాల్యవివాహల వల్ల కలిగే నష్టాలను వివరించారు. బాలికా సాధికారతకు అభ్యున్నతికి బాటలు వేసేందుకు పాఠశాలకు పంపించాలని సూచించారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చాటుతున్న పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు**

మంచిర్యాలటౌన్: కలెక్టరేట్ కార్యాలయంలో మంచిర్యాల టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి శనివారం ప్రారంభించారు. నాయకులు నాగుల గోపాల్, అశోక్, సతీశ్, విజయ, ఉదయ్, వాజిద్, రామ్‌కుమార్, కరుణాకర్, ఎజాజ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

లక్సెట్టిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ క్రిష్ణ అన్నారు. మండల కేంద్రంలోని వాగేశ్వరి జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అపరిచితులు ఫోన్ చేసి వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఎలాంటి ఇబ్బంది ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఎస్సై లక్ష్మణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

**భీమారం అభివృద్ధికి సహకరించాలి**

భీమారం: భీమారం గ్రామ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ గద్దె రాంరెడ్డి కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల ఎంపిక కోసం పంచాయతీ కార్యాలయంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామం విస్తీర్ణంలో చాలా పెద్దగా ఉందని, ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని సర్పంచ్ కోరారు. తహసీల్దార్ విశ్వంబర్ మాట్లాడుతూ ప్రజలు ఐక్యంగా ఉండి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చుదిద్దాలన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**'దేశవ్యాప్తంగా సేవలందిస్తున్నాం'**

మంచిర్యాలక్రైం: దేశవ్యాప్తంగా జమాఅత్-ఏ-ఇస్లామి హింద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సేవలందిస్తోందని రాష్ట్ర అధ్యక్షుడు ఎంకేఎం జాఫర్ అన్నారు. స్థానిక ఎఫ్‌సీఐ ఫంక్షన్ హాల్‌లో శనివారం జిల్లా కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 75 ఏళ్లుగా కులమతాలకతీతంగా సంస్థ సేవలందిస్తుందన్నారు. రాష్ట్ర డైరెక్టర్ ఎస్ఎమ్ ఫసిఉల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నయిమోద్దీన్ హైమద్, జిల్లా ఆర్గనైజర్ రఫిక్ హైమద్ పాల్గొన్నారు.

**23 నుంచి పత్తి కొనుగోళ్లు**

చెన్నూర్: పట్టణంలోని జాతీయరహదారి పక్కన గల కొత్త మార్కెట్ యార్డులో ఈనెల 23 నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని కార్యదర్శి రామాంజనేయులు, సీసీఐ సీపీవో ఉదయ్‌షా ఓ ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌కమిటీ పరిధిలోని చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి మండలాల రైతులు వాహనాల్లో 40 క్వింటాళ్ల పత్తి తీసుకురావాలని పేర్కొన్నారు. ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పత్తి తూకం ఉంటుందని వివరించారు.